# క్రాంతి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు)(పీపుల్స్‌వార్) ఏ.పి. రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 28 సంచిక : 2 జూలై 28-ఆగస్టు 3,2004 వెల : ఐదురూపాయలు



## అమరవీరుల సంస్మరణ వారం ప్రత్యేక సంచిక

# ప్రజాయుద్ధ చరిత్రలో మైలురాళ్ల వాళ్ల

దాదాపు 14 సంవత్సరాల తర్వాత మొగిలిచర్లలో మనం మన అమరులైన ప్రియతమ కామ్రేడ్స్‌ను సంస్మరించుకోడానికి బహిరంగంగా కదిలి రాగలిగాం. ఈ అవకాశం మనకు కలగడానికి కూడా ఈ కామ్రేడ్స్ నెత్తుటి త్యాగాలే కారణం.

1990లో అనివార్య స్థితిలో ప్రజావత్తిడికి లొంగివచ్చిన చెన్నారెడ్డి ప్రభుత్వం విప్లవోద్యమానికి లీగల్ అవకాశాలను కల్పించక తప్పలేదు. అయినప్పటికీ తన ఫాసిస్టు ముఖాన్ని ఏడాది తిరగకుండానే బైటపెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి నిర్బంధకాండను ప్రారంభించింది. ప్రజలపై కాల్పులతో మొదలై అక్రమ అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లతో కొనసాగిన వారి పాలనలో ఎందరో ప్రజలూ, సానుభూతిపరులూ, పార్టీ సభ్యులూ, కార్యకర్తలూ, నాయకులూ అమరులయ్యారు.

పదుల సంఖ్యలో గ్రామాల నుండి సంఘనాయకుల్ని పట్టుకెళ్లి హతమార్చారు. ఆకలికి లొంగిపోయిన వాళ్లను కూడా వదలకుండా చంపేసారు. గ్రామాలపై దాడులు చేయడం విచక్షణా రహితంగా కొట్టడం, స్త్రీలపై లైంగిక అత్యాచారాలు చేయడం, ధాన్యం పారబోయటం వంటి అనేక ఫాసిస్టు చర్యలను గ్రామీణ ఉద్యమ ప్రాంతాలన్నిటా అమలుచేసి అల్లకల్లోలం సృష్టించారు. విశాఖ, తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలో గూడేల్ని ఖాళీ చేయించి ప్రజలందర్నీ ఒక దగ్గర కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులా కుప్పవేసిర పార్టీకి దూరం చేయ ప్రయత్నించారు. మరోవైపు బలమైన కార్మిక, విద్యార్థి తదితర వుద్యమాలున్న సింగరేణి, వరంగల్ జంటనగరాల ఉద్యమాలపై ఉక్కుపాదాన్ని మోపి ఎందరో విలువైన కామ్రేడ్స్‌ను బలిగొన్నారు. 92లో ఒక్క జంటనగరాలలోనే 20కి పైగా పార్టీ ఆర్గనైజర్లను జిల్లాకమిటీ సభ్యుడు బెంజిమెన్‌నీ హత్యగావించారంటేనే నిర్బంధపు తీవ్రతను అంచనా వేసుకోవచ్చు. సింగరేణి సెక్రటరీ కట్లమల్లేష్ సహా ఎందరో ఆర్గనైజర్లు, పూర్తికాలం కార్యకర్తలు అసువులు బాసారు.

1991 నుండి 2004 వరకు దఫదఫాలుగా గ్రామాల నుండి సంఘ నాయకులను, మిలిటెంట్లను ఎత్తుకెళ్లి పెద్ద సంఖ్యలో కాల్చి చంపుతూనే వున్నారు. పార్టీకీ, సైన్యానికీ వాళ్లే కళ్లూ చెవులూ వంటి వాళ్లని భావించిన ప్రభుత్వం వారిని నిర్మూలించి పార్టీని దెబ్బతీయాలని చాలా క్రూరమైన దమనకాండకు పాల్పడింది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వారిపై నిర్బంధకాండను మరింతగా పెంచి ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను అడ్డుకోవడానికి శతవిధాలా ప్రయత్నించింది.

1992 జూన్‌లో ఏకంగా పీపుల్స్‌వార్ పార్టీనీ, ప్రజాసంగాలనూ నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఈ మారణకాండకు మరింత సాధికారతను సాధించి పెట్టాయి. అప్పటి నుండి ఈ పన్నెండేళ్ల కాలంలో భారత విప్లవోద్యమ నిర్మాతలు, నేతలు, కార్యకర్తలు, ప్రజలు వేల సంఖ్యలో అమరులైనారు.

1994లో సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన ఎల్.ఐ.సి(లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్) పాలసీ విప్లవోద్యమంపై మరింత క్రూరమైన అణచివేతకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా పచ్చి సైనిక నియంతలు అనుసరించిన అనేక క్రూర పద్ధతులను 'ఎన్నికైన ప్రభుత్వం' పేరుతో చంద్రబాబు అమలు చేసాడు. ఈ 9 ఏళ్ల కాలంలో పోలీసు వ్యవస్థ, ముఖ్యంగా ఇంటలిజెన్స్ యంత్రాంగం ఒక బలమైన అంగంగా స్థిరపడింది. అంతులేని, ఊపిరాడని నిర్బంధకాండ ప్రజల్ని పీల్చి పిప్పి చేసింది. కనీ, వినీ ఎరుగని నిర్బంధ రూపాలు ప్రజల్ని నివ్వెరపోయేలా చేశాయి. ప్రజాస్వామిక హక్కులు నామరూపాలు లేకుండా పోయాయి. రెండున్నర ఏళ్ల వయస్సున్న పాప (మౌనిక) నుండి 70 ఏళ్ల వృద్ధుల వరకు నిర్బంధపు అగ్నిజ్వాలలో శలభాల్లా రాలిపోయారు.

ఈ పన్నెండేళ్ల కాలం కేవలం ఫాసిస్టు నిర్బంధ కాలం మాత్రమే కాదు. విప్లవోద్యమం లోతునూ, విస్తృతినీ సంతరించుకుని ఉన్నతస్థాయికి ఎదిగిన కాలం కూడా. ఒక దేశవ్యాప్త ఉద్యమ స్వరూపాన్ని సంతరించుకున్న కాలం. దళాలుగా వున్న సాయుధ శక్తులు ప్రజాగెరిల్లా సైన్యంగా రూపం తీసుకున్న కాలం.

విప్లవోద్యమాన్ని స్థావర ప్రాంతాల నిర్మాణం వైపుగా పురోగమింపజేస్తూ, ప్రజా గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసేస్థాయికి ఎదిగించడంలో నిషేధం తర్వాత ఈ పన్నెండళ్ల కాలంలో అమరులైన కామ్రేడ్స్ అందరి పాత్ర ఎంతగానో వుంది. వారి త్యాగమయ జీవితాలు లేకుండా విప్లవోద్యమ పురోగమనం సాధ్యమయ్యేది కాదు. జూలై 28 వారందరి త్యాగాలనూ మననం చేసుకుని వారి ఆశయ సాధకు పునరంకితం అయ్యే సందర్భం. మనకత్యంత ప్రియమైన మన అమరుల త్యాగాలను ఒకసారి స్మరిద్దాం!

౧౯౯౨ మార్చిలో రంగారెడ్డి జిల్లాలో కమాండర్ గంగన్నను కాల్చి చంపడంతో మొదలైన ఎన్‌కౌంటర్‌ల పరంపర జంటనగరాల వుద్యమాన్ని తీవ్రంగా నష్టపరిచింది. ఏప్రిల్‌లో ఒక సిఓను, ఒక సానుభూతిపరుడిని, జూన్‌లో కా.వేణు (ఆర్గనైజర్), జూలైలో ఎం.ఎస్.ఆర్ (సి.ఓ), నరేన్, సెప్టెంబరులో జిల్లా కమిటీ సభ్యుడు బెంజిమిన్, ౧౯౯౩ జనవరిలో కా.సుధాకర్ (సి.ఓ) మరికొందరు పోలీసులకు చిక్కి తీవ్ర చిత్రహింసలు పెట్టినా నోరు మెదపక అమరులై ఆదర్శప్రాయంగా నిలిచారు.

౧౯౯౨లో వరంగల్ జిల్లాలో పసరగొండలో నలుగురిని, కాటాపురంలో నలుగురిని, దమ్మక్కపేటలో నలుగురిని ప్రభుత్వం కాల్చి చంపింది.

౧౯౯౨లో పగిడేరు వద్ద జీపులో ప్రయాణిస్తున్న ౧౩మంది కామ్రేడ్స్‌ను పట్టుకుని ఏమాత్రం కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. అదే సంవత్సరం కరీంనగర్ జిల్లాకమిటీ సభ్యుడు అల్లెశంకర్‌ని పట్టుకుని బూటకపు ఎదురుకాల్పుల్లో కాల్చి చంపారు. కరీంనగర్‌లోనే అచ్చంపేటలో దళం వున్న షెల్టర్‌పై దాడిచేసి డిసి సభ్యుడు రామన్నతో సహా ఆరుగురు కామ్రేడ్స్‌ను చంపారు.

౧౯౯౨ మేలో ఈస్ట్ డివిజన్‌లోని పారుపాకల వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ విజయ్ కుమార్, గోపన్న, సాగర్, టుబ్రిలు అమరులయ్యారు. ౧౯౯౨లో ఈస్ట్ డివిజన్‌లో మోహనాపురంలో జన్ను కృష్ణ అనే సంఘ నాయకుడిని పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. ౧౯౯౨లో మోహనాపురం దళం పై కాల్పులు జరిపినప్పడు దళసభ్యుడు, నారాయణ అమరుడైనాడు. ౧౯౯౨లో నిజామాబాద్ జిల్లాలో మహిళా కమాండర్ కా.స్వరూపను మాటుగాసి ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు.

౧౯౯౩లో ఉత్తర తెలంగాణా రీజనల్ కమిటీ సభ్యుడు కా.శంకర్‌తో పాటు కా.విజయనూ నిజమాబాద్‌లోని ఒక షెల్టర్‌లో పట్టుకుని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారు. వరంగల్ జిల్లాకమిటీ సభ్యుడు, ఉత్తర తెలంగా రీజనల్ కమిటీ సభ్యుడు, కా.బాలన్నను, ఆయన సహచరినీ కూడా ౧౯౯౩లో పట్టుకుని అతి క్రూరంగా చంపేయడమేకాక వారి శవాలను నగ్నంగా రిక్షాలో వేసి పంపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికి ప్రయత్నించారు. ౧౯౯౩ అక్టోబరులో ఆంధ్ర రాష్ట్ర కమిటీ సెక్రటరీ, క్యాడర్ అభిమానాన్ని అత్యధికంగా చూరగొన్న నాయకుడు, పీడిత ప్రజల ఉద్యమ పుత్రుడు కా.పులిఅంజన్ననూ, కా.భాగ్యక్కనూ బెంగుళూరులో పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారు. పులి అంజన్న వంటి గొప్ప నాయకుడ్ని చంపి విప్లవోద్యమాన్ని అణచివేయగలమని కలలు కన్న ప్రభుత్వం వందల సంఖ్యలో తయారవుతున్న ఆయన వారసుల్ని చూసి ఖంగుతినక తప్పలేదు.

౧౯౯౩లో పాలకుర్తి గ్రామ ప్రజలపై కాల్పులు జరిపి నలుగురిని పొట్టన పెట్టుకున్నారు.

౯౩లో శ్రీకాకుళంలో ఒక్క ఉద్దానం ప్రాంతంలోనే ఏడుగురు మిలిటెంట్లను కాల్చి చంపారు. ౯౪ వరకు ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు విస్తృంత,గా కొనసాగాయి. ౯౪ ఎలక్షన్ల సమయంలో ఎనిమిది రోజుల్లో ఒక్క కరీంనగర్ జిల్లాలోనే ౩౦మందిని చంపారు. ౯౯ ఎన్నికల సమయంలో ఒక్క వరంగల్ జిల్లాలోనే ౩౬మంది మిలిటెంట్లను చంపారు. ౯౬లో మెదివెల్లి (కరీంనగర్ జిల్లా)లో నలుగురు యువకుల్ని చంపేశారు. ౯౭లో నిజామాబాద్ జిల్లాలో ఎందరో యువకుల్ని కాల్చి చంపారు.

౧౯౯౩లో మొదటిసారిగా శతృవు కోవర్టు ఎత్తుగడలను వుపయోగించాడు. కత్తుల సమ్మయ్య తన భార్యతో సహా కోవర్టుగా మారి కమాండర్ భూపతితోపాటు మరో ముగ్గురు కామ్రేడ్స్‌ను హతమార్చి తుపాకులతో పోలీసులకు లొంగిపోయాడు.

౯౪లో ఎన్‌టిఆర్ ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిన వెంటనే నల్లగొండ జిల్లాలో నలుగురు యువకులను కాల్చి చంపి తనను తాను అపహాస్యం చేసుకుంది.

౧౯౯౪ సెప్టెంబరులో నెల్లూరు పట్టణంలో ఆంధ్ర రాష్ట్రకమిటీ సభ్యుడు కా.సూర్యంను తిరుపతి పట్టణ మహిళా ఆర్గనైజర్, రాష్ట్ర మహిళా వుద్యమ నిర్మాతల్లో ఒకరైన కా.పద్మక్కనూ పట్టుకుని పోలీసులు చెప్పనలవిగానీ చిత్రహింసలకు గురిచేసి బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చివేశారు. వీరి మరణం రాష్ట్ర విప్లవోద్యమానికీ, మహిళా ఉద్యమానికీ కూడా తీరని లోటునే మిగిల్చింది.

౧౯౯౪లోనే నరహంతక వ్యాసుగాడ్ని ఖతం చేయడంలో మంచి పాత్ర వహించిన వీర గెరిల్లా కా.వీరన్నను హైదరాబాద్‌లో అరెస్టు చేసి, కసి దీర్చుకునేలా చిత్రహింసలపాల్జేసి హత్య చేశారు.

౧౯౯౫ ఫిబ్రవరిలో విశాఖ ఏజెన్సీలో పోలీసులు ఇన్ఫార్మర్ ఇంటిలోనే మాటుగాసి కాల్పులు జరపడంతో డిప్యూటీ కమాండర్లయిన కామ్రేడ్స్ జాంబ్రి, దుర్గన్నలు మరణించారు. ౧౯౯౭ ఆగస్టులో ఒరిస్సా పరిధిలోని కోపర్‌డంగ్ వద్ద జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ౧౩ మంది కామ్రేడ్స్ వీరోచితంగా ప్రతిఘటిస్తూ అమరులయ్యారు. వారిలో ఈస్ట్ రీజనల్ కమిటీ సభ్యుడు, శ్రీకాకుళం జిల్లాకమిటీ సభ్యుడు కా.రాజన్న, భూమన్న (డిసి సభ్యుడు), కమాండర్ కా.పద్మ, కమాండర్ దుర్వాసులు, డిప్యూటీ కమాండర్ గున్నక్క, కమాండర్ రామన్న మరికొందరు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌ని పూర్ణచంద్రరావు హెలికాప్టర్‌తో సమన్వయం చేసాడు. ఇట్లా హెలికాప్టర్‌తో సమన్వయం చేయడమనేది పార్టీ చరిత్రలో మొట్టమొదటిది. అదే సంవత్సరం అక్టోబరులో శ్రీకాకుళం జిల్లా ముఖలింగాపూర్ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ సంధ్య, మంగన్నలు నేలకొరిగారు.

౧౯౯౫లో చిత్తూరు జిల్లా కాళంగి దళంపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో కమాండర్ భూపతితో సహా ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. సింగరేణిలో నిర్బంధం నిప్పలు చెరుగుతూనే వుండింది. ఈ కాలంలో అక్కడ కొందరు పూర్తికాలం కార్యకర్తలు అమరులయ్యారు. కొద్దికాలంలోనే తిరిగి ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో కామ్రేడ్స్ అమరులు కావడం ప్రారంభమైంది.

౧౯౯౬ ప్రారంభంలో ఆంధ్రరాష్ట్ర కమిటీ సభ్యుడు. కా.రెడ్డప్ప, కడప-చిత్తూరు జిల్లాల సెక్రటరీ కా.భూపతి, సీనియర్ మహిళా కామ్రేడ్ విజయక్క, కొరియర్ కా.సుధాకర్‌లను బెంగుళూరులోనే అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి కడప జిల్లాలో శవాలను పడవేశారు. అదే సంవత్సరం మెదక్ జిల్లా వుద్యమ నిర్మాతల్లో ఒకరైన కా ఓరుగంటి సుదర్శన్ (మహేందర్) (మెదక్ జిల్లా సెక్రటరీ, దక్షిణ తెలంగాణా రీజినల్ కమిటీ సభ్యుడు) ను, అదే సంవత్సరం జంటనగరాల ఆర్‌టిసి రంగ ఆర్గనైజర్ కా శంకర్‌ను బయటే పట్టుకుని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు.

౧౯౯౬లో చద్మల్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో డిసి సభ్యుడు సలీంతోపాటు ఆరుగురు కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగారు. ఆ సంవత్సరం మొత్తం రాష్ట్రాన్నే కుదిపివేసిన మరో ఎన్‌కౌంటర్ సింగరేణి బెల్ట్‌కమిటీ సభ్యుడు కా.సమ్మిరెడ్డిది. కా.సమ్మిరెడ్డి వున్న ఇంటిని చుట్టుముట్టి వందలాది ప్రజలు చూస్తుండగా పోలీసులు గుండ్లవర్షం కురిపించారు. సమ్మిరెడ్డి ఒక్కడే అంతమందిని ఎదుర్కొని ఒక ఎస్.ఐని చంపి కొందరు పోలీసుల్ని గాయపరిచాడు. తర్వాత పోలీసులు ఇంటిపైకప్పు మీద నుండి నిప్పు పెట్టి ఆ కామ్రేడ్‌ను హతమర్చారు. కా.సమ్మిరెడ్డి వీరోచిత ప్రతిఘటన పట్టణోద్యమంలో మైలురాయిగా నిలిచింది. షెల్టర్ ఇచ్చిన మహిళ కా నిరంజనను కూడా కాల్చి చంపి ప్రభుత్వం తన పాశవికతను చాటుకుంది.

౧౯౯౭ డిసెంబర్‌లో మెదక్ జిల్లా సాల్వాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో విశాఖ జిల్లా మహిళా ఆర్గనైజర్ కా.సావిత్రి, మెదక్ కమాండర్ కా.ప్రసాద్ అమరులయ్యారు.

౧౯౯౭లో తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రాసపాలెం ఎన్‌కౌంటర్‌లో జిల్లా ఆర్‌ఎస్‌యు బాధ్యుడు విశ్వనాద్, బాలరాజులు అమరులయ్యారు.

మెదక్ జిల్లాలో ౯౭లో కా.కనకాచారి (సిటీ కార్మిక రంగ సి.ఓ) ప్రమాదవశాత్తు తుపాకి పేలి చనిపోయాడు.

౧౯౯౭లో వరంగల్‌లో వడ్డేపల్లి రోడ్డు వద్ద ముగ్గురు వరంగల్ నగర సిఓలను కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు.

౧౯౯౭ ఫిబ్రవరిలో జంట నగరాల సెక్రటరీ కా.రామేశ్వర్‌ను, డిసి సభ్యుడు మజ్జిగ రాజును, మరో ఆర్గనైజర్ సికిందర్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి భయంకరంగా చిత్రహింసలు పెట్టి హత్య చేశారు. చంద్రబాబు ఫాసిస్టు హత్యలకు కసితో చెలరేగిన ప్రజలు ఒక వెల్లువలా తరలి వచ్చి కా.రామేశ్వర్ అంతిమ యాత్రలో పోలీసు నిర్బంధాన్ని సైతం ధిక్కరించి పాల్గొన్నారు. ఒక నెల రోజుల్లోనే మార్చి చివరిలో మెదక్ జిల్లా లక్ష్మాపూర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆంధ్ర రాష్ట్రకమిటీ సభ్యుడు, దక్షిణ తెలంగాణా రీజనల్ కమిటీ కార్యదర్శి కా.దామోదర్ (సంజీవ్)తో సహా ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. మూడు రోజుల తర్వాత మెదక్‌లోనే తీగుల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో నలుగురు కామ్రేడ్స్ అసువులు బాసారు. ౧౯౯౭ ఫిబ్రవరిలో పీపుల్స్‌వార్ పార్టీ నిర్మాతల్లో ఒకరు, మొత్తం పార్టీకే గురుతుల్యులు అయిన కా.ఐ.వి. సాంబశివరావు అనారోగ్యంతో మరణించారు. మరణించేనాటికి ఆయన ఏ.పి రాష్ట్రకమిటీ సభ్యుడు, ఆల్టర్‌నేటివ్ సిసి సభ్యుడు.

౧౯౯౮లో కొద్ది నెలల తేడాతో జంటనగరాల కార్యదర్శి సుభాష్ (ఆయనతోపాటు మెదక్ జిల్లా కమిటీ సభ్యుడు

కా.బాలన్న, సానుభూతిపరుడు నాగార్జునరెడ్డి) జంటనగరాల డిసి సభ్యుడు, కా.పల్లెఅశోక్ (ఆయనతోపాటు ఒక ఆర్గనైజర్, కొరియర్) బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చివేయబడ్డారు.

౧౯౯౮లో నిజామాబాద్ జిల్లా సంగోజిపేట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో డిసి సభ్యుడు కామ్రేడ్ వినోద్, కమాండర్ జనార్ధన్ మరణించారు. అదే సంవత్సరం జరిగిన రెండు కోవర్టు సంఘటనలు పార్టీకి ఎనలేని నష్టాన్ని కలిగించడమేకాక శత్రువు కోవర్టు ఎత్తుగడల విస్తృతికి నాంది పలికాయి. నల్గొండ జిల్లా పావురాల గట్టులో కోవర్టు సోమ్లానాయక్ కామ్రేడ్స్ ఆయుధాలన్నిటినీ మూటగట్టేసి జరిపిన కాల్పుల్లో కమాండర్ రామన్న, సభ్యురాలు శాంతక్క మరో ఇద్దరు కామ్రేడ్స్ అమరులుకాగా మరికొందరు గాయపడ్డారు. కరీంనగర్ రామగిరి ఖిల్లా వద్ద జడల నాగరాజు కోవర్టుగా మారి జరిపిన కాల్పుల్లో వుత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కా.మల్కాపురం భాస్కర్ అమరుడయ్యాడు. కోవర్టు సోమ్లానాయక్ ఆ తర్వాత ప్రజల చేతుల్లో కుక్కచావు చచ్చాడు.

౯౮, ౯౯లో మెదక్ ఉద్యమంపై కేంద్రీకరించి శత్రువు పెద్ద దెబ్బల్నే తీయగల్గాడు. ఆ సంవత్సరాల్లో వరుసగా జరిగిన ఎన్‌కౌంటర్లలో నర్సాపూర్, గిరాయిపల్లి, దుబ్బాక, ట్రేడ్ యూనియన్ దళాలు తీవ్రంగా నష్టపోయాయి. పదుల సంఖ్యలో కామ్రేడ్స్ వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. ఇన్ఫార్మర్లకు సెల్‌ఫోన్లు ఇచ్చి క్షణాల్లో హైదరాబాద్ నుండి గ్రేహౌండ్స్ దళాలు వచ్చి మన కామ్రేడ్స్ వున్న ఇండ్లను చుట్టుముట్టేవి.

౧౯౯౮ యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌పై రెయిడ్ చేసి తిరిగి వస్తున్న కామ్రేడ్స్‌పై పోలీసులు కాల్పులు జరుపగా నల్గొండ జిల్లా కమిటీ సెక్రటరీ కా.కిరణ్, జిఆర్‌డి సభ్యుడు అమరులయ్యారు. నల్గొండ జిల్లా వుద్యమానికి ఇది ఎంతో నష్టాన్ని కలిగించిన ఎన్‌కౌంటర్. ౧౯౯౮లో ఒరిస్సాలోని గొట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో శ్రీకాకుళ ఉద్యమ సీనియర్ నేత కా.చిట్టెక్కతోపాటు ముగ్గురు మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు.

౧౯౯౮లో మహబూబ్‌నగర్ జిల్లాలో బక్కచింతపెంట ఎన్‌కౌంటర్‌లో కా.జనార్ధన్, కా.క్రిష్ణ అమరులయ్యారు.

౧౯౯౯ డిసెంబరు ౨న బెంగుళూరులో అరెస్టు చేసిన పీపుల్స్‌వార్ అగ్రనేతలు సిసి సభ్యులు కా.శ్యాం, మహేశ్, మురళిలను చంపి కొయ్యూరులో వారి శవాలను పడేశారు. వారితోపాటు పశువుల కాపరి లక్ష్మీరాజంని కూడా చంపేసి కట్టుకథ అల్లారు. పీపుల్స్‌వార్ పార్టీ చరిత్రలో ఇది అత్యంత విషాదకరమైన రోజు. ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం వేలసంఖ్యలో కదిలి ఆ ప్రజావీరులకు కన్నీటి వీడ్కోలు పలికింది.

౧౯౯౯లో రాష్ట్ర ఆర్‌ఎస్‌యు అధ్యక్ష, కార్యదర్శులైన కామ్రేడ్స్ వీరస్వామి, ప్రవీణ్‌లను మంత్రాలయంలో అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసల పాల్జేసి మహబూబ్‌నగర్ జిల్లాలో శవాలను పడేసి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. అదే సంవత్సరం చెంచు ఆదివాసీల నుండి డిప్యూటీ కమాండర్‌గా ఎదిగిన మొదటి మహిళా కామ్రేడ్ లక్ష్మి, స్పెషల్ గెరిల్లా స్క్వాడ్ సభ్యుడు లక్ష్మణ్‌లను పోలీసులు మాటుగాసి కొట్టిన దెబ్బలో అమరులయ్యారు.

౧౯౯౯లో వరంగల్ జిల్లా నేరెళ్లవాగులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. వారిలో వరంగల్ జిల్లాకమిటీ సెక్రటరీ కా.నరేష్ కూడా వున్నారు. అదే సంవత్సరం జరిగిన నరసాపురం ఎన్‌కౌంటర్‌లో నలుగురు కామ్రేడ్స్ అమరులు కాగా వారిలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు కూడా ఒకరు. సింగరేణిలో దెబ్బతిన్న ఉద్యమాన్ని తిరిగి పునర్ నిర్మిస్తున్న క్రమంలోనే ౧౯౯౯లో సింగరేణి ఉద్యమం తీవ్ర నష్టానికి గురైంది. పట్టణోద్యమానికి జరిగిన మరో తీవ్రమైన నష్టం విశాఖ నగర కమిటీ సెక్రటరీ కా.భాస్కర్ అమరత్వం. పోలీసులు ఆయనను అరెస్టు చేసి నగరంలో ఎన్‌కౌంటర్ జరిగిందనే కట్టుకథ అల్లి ఎయిర్‌పోర్టు వద్ద శవాన్ని పడవేశారు. ౧౯౯౪లో విశాఖ నగరంలో కంచరపాలెం మార్కెట్ వద్ద ప్రజలందరూ చూస్తుండగానే జిల్లాకమిటీ సభ్యుడు కా.మహేందర్‌ను కాల్చిపడేసి శవాన్ని రిక్షాలో పడేసి తీసుకువెల్లి ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించారు. ఆ తర్వాత విశాఖ ఉద్యమానికి జరిగిన తీవ్రనష్టం కా.భాస్కర్‌ది. ౯౯లో కాళంగి కమాండర్ శంకర్‌ని బయటే పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారు.

౨౦౦౦లో రాష్ట్ర వ్యాపత్తంగా దిగ్భ్రాంతిని కలుగజేసిన ఎన్‌కౌంటర్ చంద్రగిరి కొకొండ గుట్టల్లో జరిగింది. శత్రువు గ్రెనేడ్లతో, ఆటో తుపాకులతో తీవ్రంగా దాడి చేయగా ౧౨ మంది వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. ఆ కామ్రేడ్స్ మృతదేహాలను కాల్చి గుర్తుపట్టకుండా చేసి శత్రువు తన క్రూరత్వాన్ని చాటుకున్నాడు. ఆ దృశ్యాలు ప్రజల హృదయాలను కకావికలు చేశాయి. ఇక్కడ మరణించిన వారిలో వరంగల్ సిటీ సెక్రటరీ శ్యాం, వరంగల్ డిసి సభ్యుడు వెంకన్న, ఎల్‌జిఎస్ కమాండర్ జ్యోతి వున్నారు. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు హత్యలకు పరాకాష్టగా తీగులవాగు వద్ద విప్లవ మహిళా సంఘం సమావేశం జరుగుతుండగా దాడి జరిపి వరంగల్ పోలీసులు ముక్కుపచ్చలారని బాలికతో సహా ఏడుగురు మహిళల్ని పొట్టన పెట్టుకున్నారు. మహిళా పక్షపాతిగా రోజా బాకాలూదుకునే చంద్రబాబు అసలు నైజం ఈ సంఘటనతో నగ్నంగా బైటపడింది. మహిళా సంఘం పెట్టుకునే హక్కు

కూడా తెలంగాణ పల్లెల్లో మహిళలకు లేకుండా పోయిందనడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ.

౨౦౦౦లో కరీంనగర్ జిల్లా మద్దిమల్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎన్‌టిఎస్‌జడ్‌సి సభ్యుడు వినోద్, మరో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు.

౨౦౦౦లో నల్గొండ జిల్లాలో జరిగిన తాళ్లవెల్లంల ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ స్వర్ణ, అంజమ్మ, మరికొందరు కామ్రేడ్స్ అమరులయ్యారు.

క్రూరుడైన ఎ.ఐ.జి ఉమేష్‌చంద్రను పట్టపగలు హైదరాబాద్ నగర నడిబొడ్డున హతమార్చిన వీరకిశోరాలు, బెల్లి లలితను ముక్కలుగా నరికించిన, వందలాది కామ్రేడ్స్ మరణాలకు కారణమైన నరహంతకుడు హోంమంత్రి మాధవరెడ్డిని మందుపాతరలో మట్టుబెట్టి మార్చి ౮ కానుకను అందించిన యాక్షన్ టీమ్ వీరగెరిల్లాలు అయిన కామ్రేడ్స్ సల్వాచారి, జహీర్, ప్రవీణ్‌లను పోలీసులు హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్ వద్ద కాల్చి చంపారు. అక్కడి నుండే కా.కృష్ణను వెంబడించి పట్టుకుని కాల్చి చంపారు. యాక్షన్ టీం అమరుల సాహసగాథల్ని ఆంధ్ర రాష్ట్రమంతటా ప్రజలు గానం చేశారు. మరో ఎన్‌కౌంటర్‌లో ఆదిలాబాద్ డిసి సెక్రటరీ సూర్యం, ఎల్‌జిఎస్ కమాండర్ సంతోష్‌లు అమరులు కావడం ఆదిలాబాద్ జిల్లాకు తీరని నష్టం కలిగించింది.

కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను క్రూరంగా హత్యగావించిన చంద్రబాబు ప్రభుత్వంపై కసితో రగిలిపోతున్న గెరిల్లాలు దారకొండపై రెయిడ్ చేసి తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ రెయిడ్‌లో డిప్యూటీ కమాండర్ సత్యనారాయణనూ, స్కోమా స్టాఫ్ సభ్యుడు, జంగ్ పత్రిక బాధ్యుడు అయిన కా.నవీన్ అమరులు కావడం ఎంతో విషాదాన్ని మిగిల్చింది,

౨౦౦౧లో ఎందరో అమరులు కన్న కలలు సాకారమై పార్టీ ౯వ కాంగ్రెస్‌ను విజయవంతంగా జరుపుకుని ౨౦ సంవత్సరాల ఉద్యమ అనుభవాల్ని క్రోడీకరించుకోగలిగింది. ముఖ్యంగా ఆ కాంగ్రెస్ సన్నాహాల్లో ఎంతో ముఖ్య పాత్ర వహించి భారత విప్లవోద్యమానికి అద్భుతమైన నేతృత్వాన్ని అందించిన కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళిల కృషి అక్కడ అంతటా ప్రతిఫలించింది. అయితే మరోవైపు అదే సంవత్సరం తీవ్ర నష్టాలు కూడా జరిగాయి. కాంగ్రెస్ జరిగిన కొద్ది రోజులకే కర్ణాటక రాష్ట్ర పార్టీ నుండి ఏఓబి వుద్యమాన్ని అధ్యయనం చేసి నేర్చుకోడానికని వచ్చిన కా.అనిత (రాజేశ్వరి)ని నరహంతక పోలీసులు నిరాయుధంగా పట్టుకుని కాల్చి చంపారు. ఆమె వద్ద ఆయుధం లేకున్నా, ఆమె స్థానిక దళ సభ్యురాలు కాదని అర్థమై కూడా నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. అదే సంవత్సరం యాక్షన్ టీం సభ్యులు కామ్రేడ్ విజయభాస్కర్, కా.సైదులు (సాగర్) ఏలూరు రైల్వేస్టేషన్‌లో తమ వద్ద వున్న బాంబు పేలడంతో అక్కడికక్కడే మరణించారు. హైదరాబాద్‌లో యాక్షన్ టీం అమరుల తర్వాత జరిగిన ఈ నష్టం కోలుకోలేనిదిగా వుండింది.

౨౦౦౧లో నిజామాబాద్ డిసి సభ్యుడు కా.ఐలన్నను పట్టుకుని కాల్చి చంపారు. ఆయన డైరీ దొరికిందనే సాకుతో ఆ తర్వాత అనేకమంది ప్రజలను అరెస్టు చేసి తీవ్రంగా వేధించారు.

౨౦౦౧లో ఖమ్మం జిల్లాకమిటీ సభ్యుడిని కూడా పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపివేశారు. ఏఓబిలో విశాఖ ఏజెన్సీలో జరిగిన  ఒక పోలీస్ దాడిలో కా.వనజ (ప్లాటూన్ సెక్షన్ కమాండర్) గుండెవద్ద తూటా పడినా శత్రువుతో వీరోచితంగా పోరాడి మిగతా కామ్రేడ్స్‌ను రక్షించింది. మెదక్‌లోనూ ఇతరత్రా జరిగిన ఎన్‌కౌంటర్ నష్టాల నుండి తేరుకుని పురోగమిస్తున్న దక్షిణ తెలంగాణా ఉద్యమంకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. పానగల్ దళానికి చెందిన అయిదుగురు కామ్రేడ్స్ (కమాండర్ శ్రీనుతో సహా) రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో అసువులు బాసారు. రాచకొండ గుట్టల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో దక్షిణ తెలంగాణా రీజనల్ కమిటీ సభ్యుడు, నల్గొండ జిల్లా సెక్రటరీ, జెన్‌ఎం కళాకారుడుగా విఖ్యాతి గాంచిన కా.దివాకర్‌తోపాటు ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. జంటనగరాల కార్మికోద్యమ ఆర్గనైజర్ త్రిమూర్తులు కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించడం మరో తీరని ఓటు; రెండున్నరేళ్ల మౌనికను కూడాకిరాతకంగా కాల్చి చంపిన పోలీసులు తమ ఫాసిస్టు నైజాన్ని బయటపెట్టుకున్నారు. కనగల్ దళంపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏసిఎస్ భాస్కర్, ఎల్‌జిఎస్ కమాండర భవానితోపాటు కొందరు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఒక లంబాడీ స్త్రీ కూడా పోలీసు కాల్పుల్లో మరణించింది.

౨౦౦౧ ఆగస్టు ౯న మోటు పోలీసు స్టేషన్‌పై దాడి జరిపినప్పుడు ప్రమాదవశాత్తు మైన్ పేలి కామ్రేడ్స్ క్రాంతి రణదేవ్, విజయ్‌లు అమరులయ్యారు. ఆదిలాబాద్‌లో జరిగిన గండిగోపాల్‌పూర్ ఎన్‌కౌంటర్‌లో మహేశ్‌తోపాటు ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు.

౨౦౦౧ ప్రారంభంలోనే సిటీ కార్మికోద్యమ, యూత్ ఆర్గనైజర్ కా.నాని (ప్రకాష్)ను రంగారెడ్డి జిల్లాలో పోలీసులు

అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలు పెట్టి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు.

2002లో పార్టీ సీనియర్ నాయకులను ఉద్యమం కోల్పోయింది. క్రిష్ణానది దాటుతుండగా పుట్టి మునగడంతో ఆంధ్ర రాష్ట్రకమిటీ సెక్రటేరియట్ సభ్యుడు కా.కృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ సభ్యుడు కా.రామన్న, దక్షిణ తెలంగాణ జెఎన్‌ఎం బాధ్యుడు కా.భాస్కర్, కా.కృష్ణ గార్డు కా.మధులు అమరులయ్యారు. జులైలో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కా.పద్మతోపాటు కా.సాగర్ మరో ఇద్దరు కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులయ్యారు. ఆంధ్ర రాష్ట్ర పార్టీలో రాష్ట్ర నాయకత్వ స్థాయికి మొదటిగా ఎదిగిన మహిళా కామ్రేడ్ కా.పద్మ మరణం యావత్ ఆంధ్ర రాష్ట్ర పీడిత ప్రజానీకాన్ని విషాదంలో ముంచెత్తింది. అంతకుముందు జరిగిన తుపాకులగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8మంది కామ్రేడ్స్ వీరోచితంగా ప్రతిఘటించి పార్టీ నాయకత్వాన్ని కాపాడుతూ అమరులయ్యారు. ఆ తర్వాత 2 రోజులకు మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను ఆ పరిసర ప్రాంతాల్లోనే పట్టుకుని హతమర్చారు. వరంగల్ జిల్లా దామెరలో జులైలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో డిసి సభ్యుడు శ్రీను, ఏసిఎస్ నవీన్, ఎసిఎం జ్యోతి నేలకొరిగారు. ఐలాపూర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీనియర్ జెఎన్‌ఎం నేత కా.పద్మ (విద్య)తోపాటు మరో నలుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు.

2002 జూలై నెలలో ఆలాటం వద్ద గ్రేహౌండ్స్ పోలీసులపై వీరోచితంగా దాడి జరిపిన కామ్రేడ్స్ ఆనంద్ (డిసి సభ్యుడు, ప్లాటూన్ కమాండర్), కా.సలీం (ప్లాటూన్ సెక్షన్ కమాండర్) మరో ఇద్దరు ప్లాటూన్ సభ్యులు తిరిగి పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరులయ్యారు.

జనశక్తి పార్టీ మితవాద అవకాశవాద రాజకీయాలను ఎదిరించి పీపుల్స్‌వార్ పార్టీలో చేరిన కా.రాంబాబును కర్నూలు టౌన్‌లోని లేబర్ కాలనీలో పట్టుకుని తీవ్ర చిత్రహింసలు పెట్టి 2002 ఆగస్టు 27న చంపేశారు.

2003 సంవత్సరంలో ఉత్తర తెలంగాణాలో చాలా సీనియర్ నాయకుల్ని కిరాతంగా కాల్చి చంపి శత్రువు విర్రవీగాడు. ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కా.రామక్రిష్ణతోపాటు మరో ముగ్గురు కామ్రేడ్స్‌ను కాల్చి చంపి శత్రువు పెద్ద విజయంగా చాటుకున్నాడు. ఆ తర్వాత కా.అనుపురం కొమురయ్యను విజయవాడ నగరంలో పట్టుకుని చిత్రహింసలు పెట్టి బూటకపు ఎదురుకాల్పుల్లో కాల్చి చంపాడు. ఆదిలాబాద్ డిసి సెక్రటరీ కా.లలిత మరో ఇద్దరు మహిళా కామ్రేడ్స్ శత్రువును వీరోచితంగా ప్రతిఘటిస్తూ నేలకొరిగారు. కడప జిల్లా చాకిబండ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యుడు. కా.కారుమంచి ప్రసాద్, కా.సంధ్య (డిప్యూటీ) మరణించారు. అక్కడున్న ఇద్దరు నిరాయుధ పశువుల కాపర్లను పట్టుకుని పోలీసులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు.

2003 ఏప్రిల్ నెలలో జంటనగరాల ఉద్యమం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. జిల్లాకమిటీ సెక్రటరీ కా.రమణారెడ్డి, ఏసి సెక్రటరీ కా.వినోబాలను పట్టపగలు నడిరోడ్డుపై పోలీసులు మాటుగాసి కాల్చి చంపారు. అదే సంవత్సరం కోవర్టు సిరాజ్ పట్టివ్వడంతో నల్గొండ డిసి సభ్యుడు నర్సింహులును పోలీసులు కాల్చి చంపారు. అక్టోబర్‌లో తూ.గో. జిల్లా తంగానికోటలో రాజేశ్ (డిప్యూటీ కమాండర్) ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. బాసధారలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో సునీల్, దమయంతిలు మరణించారు. నవంబరులో ఈస్ట్ డివిజన్ బత్తునూరులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా.రజిత, కా.స్వరూప అమరులయ్యారు. ఒక పాప గాయపడింది. తూటాల గాయాలతో కూడా వీరోచితంగా ప్రతిఘటించిన కా.స్వరూప 2 గంటలపాటు శత్రువును నిలువరించిన తీరు ప్రజల నెంతో ఉత్తేజపరిచింది. డిసెంబరులో ఈస్ట్‌లోనే జాజిపాలెం ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ సుఖ్‌దేవ్, ప్రభాకర్‌లు అమరులు కాగా, సన్యాసిరావు అనే పన్నెండు సంవత్సరాల బాలల సంఘం నాయకుడిని కూడా కిరాతకంగా కాల్చి చంపారు. సింగరేణిలో ఇద్దరు ఎల్‌జిఎస్ కమాండర్లను, ఒక సభ్యుడిని షెల్టర్‌లో పట్టుకుని కాల్చి చంపారు.

2003 అక్టోబర్‌న అలిపిరి వద్ద చంద్రబాబుపై వీర గెరిల్లాలు వీరోచితమైన దాడి చేసిన తరువాత పిచ్చికుక్కల్లా తిరిగిన పోలీసులు విశాఖ నగర కమిటీ సెక్రటరీ, ఏఓబి ఎస్‌జడ్‌సి మెంబర్ అయిన కా.కౌముది (సదానందం), గుంటూరు జిల్లా కమిటీ సభ్యురాలు కా.లత (సుగుణ), విశాఖ నగర కమిటీ సభ్యుడు కా.జనార్ధన్‌లను పట్టుకుని అక్టోబర్ 24న కాల్చి చంపారు. అప్పటికే రెండుసార్లు జిల్లాకమిటీ స్థాయి ఎన్‌కౌంటర్లతో దెబ్బతిన్న విశాఖ ఉద్యమాన్ని ఇది వెంటనే కోలుకోలేనంతగా నష్టపరిచింది. పార్టీలో మొట్టమొదటి మహిళా కమాండర్ సీనియర్ నేత అయిన కా.లత మరణం యావత్ ప్రపంచాన్నీ దిగ్భ్రాంతికి గురిచేసింది.

2003లో వరంగల్ జిల్లా ఇన్‌చం చెరువు వద్ద ముగ్గురు యువకులను చంపారు.

2004 మార్చి 14న వరంగల్ జిల్లా ఇన్‌సాన్ పల్లి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో చిట్యాల ఎల్‌జిఎస్ కమాండర్

కా.సుగుణ (రాధక్క) అమరురాలైంది.

2004 జనవరిలో ఆంధ్ర రాష్ట్ర కమిటీ మిలిటరీ కమీషన్ సభ్యుడు కా.సత్యం, అనంతపూర్ కమిటీ సెక్రటరీ కా.గంగారామ్, జిల్లా కమిటీ సభ్యుడు కా.శివానంద్‌లను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. అలిపిరి దాడిలో వాళ్లు నిందితులనీ, ఎంతో ప్రమాదకరమైన వ్యక్తులనీ చెపుతూ ప్రభుత్వం ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు ఎంతో చట్టబద్ధతను కల్పించాలని ప్రయత్నించినా బూర్జువా పేపర్లు సైతం ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని బహిర్గత పర్చడంతో ప్రభుత్వం సమాధానం చెప్పకోలేకపోయింది.

2004 ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్‌లో ఇద్దరు ఎల్‌జిఎస్ కమాండర్లు (కా.రత్నం, ప్రసాద్) మరో సభ్యులు పోలీసు కాల్పుల్లో మరణించారు. మెదక్ జిల్లాలో కామ్రేడ్స్ సాగర్, శ్యాంలను పట్టుకుని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు.

చివరికి చర్చల గురించిన ప్రయత్నాలు ముమ్మరంగా ఒకవైపు కొనసాగుతుండగానే కోవర్టు లక్ష్మణ్ ఇద్దరు సభ్యుల్ని చంపి, కొందర్ని గాయపరిచి తుపాకులతో పరారయ్యాడు.

మెదక్ ఆర్టీసి రంగంలో పని చేస్తున్న కా.సుధాకర్‌ను 2000లో పట్టుకుని కాల్చి చంపారు. 2000లో పార్టీ పనిపై బయటకు వెళ్లిన కా.రామస్వామి (మహబూబ్‌నగర్ డిప్యూటీ కమాండర్)ను పట్టుకుని కాల్చి చంపారు. 2003లో ఆంధ్ర రాష్ట్ర కమిటీ కొరియర్ మధును, రాయలసీమకు చెందిన ఇద్దరు కామ్రేడ్స్‌తోపాటు పట్టుకుని తీవ్ర చిత్రహింసల పాల్జేసి చంపేశారు. 1998లో మహబూబ్‌గనర్‌లో ఇలాగే పార్టీ పని మీద బయటకు వెళ్లిన కా.శ్రీశైలంను చంపివేశారు.

ఈ పన్నేండేళ్ల కాలంలో అనారోగ్యంతో బాధపడ్తూ వైద్యం కోసం బయటకు వచ్చిన అనేకమంది కామ్రేడ్స్ ఇన్ఫార్మర్ల వల్ల శత్రువు చేత చిక్కి అమరులైనారు. ఎంతో అనారోగ్యంతో వుంటేతప్ప విప్లవ కార్యకర్తలు బయటకు వైద్యం కోసం రారు అనే సత్యం తెలిసినప్పటికీ శత్రువు వారినా స్థితిలో కూడా ఎంతో కిరాతకంగా హింసించి చంపడం వెనుక వున్న క్రూరత్వానికి ఒళ్లు జలదరిస్తుంది. ఎన్‌కౌంటర్లలో గాయాలైన వారి స్థితి కూడా ఇదే. ఇటువంటి స్థితిలో తీవ్రమైన అనారోగ్యానికి గురై, ఎన్‌కౌంటర్లలో గాయాలపాలై సరైన సమయంలో వైద్య సహాయం అందక ఎందరో కామ్రేడ్స్ చెప్పనలవికాని ఇబ్బందులకు గురయ్యారు. మృత్యుముఖంలోకి వెళ్లి వెనక్కి వచ్చిన కామ్రేడ్స్ ఇంకెందరో !

చంద్రబాబు ప్రభుత్వం నల్లదండు ముఠాలను ఏర్పర్చి జననాట్యమండలి నాయకుడు, విప్లవకవి కా.గద్దర్‌పై 1997లో హత్యాప్రయత్నం చేసింది. డోలక్ దయను దేశ రాజధాని ఢిల్లీలో మాయం చేసి తీవ్రమైన చిత్రహింసల పాల్జేసి హైదరాబాద్‌లో చంపేసింది.

ప్రజాస్వామ్య తెలంగాణ కావాలని నినదించినందుకు నయీం నల్లదండు ముఠా కా.బెల్లి లలితను 17 ముక్కలుగా నరికి చెరువుల్లో, బావుల్లో ఆ శరీర భాగాలను పడేసింది. ప్రజల హక్కులకై పోరాడినందుకు ఏపిసిఎల్‌సి నాయకులు కా.పురుషోత్తంను 2000 లో, కా.ఆజం ఆలీలను 2001 లో అతి కిరాతకంగా నడిరోడ్డులో ఈ ముఠాలు నరికివేశాయి. వరంగల్‌లో 1996 ప్రజా వైద్యుడు ఆమెడ నారాయణను గుర్తు తెలియని వ్యక్తుల పేరుతో పోలీసులే హతమార్చారు.

వరంగల్ నగరంలోని చాలామంది మేధావులను అరెస్టు చేసి తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసి అక్రమ కేసులతో జైలుపాలు చేశారు. నిర్బంధానికి గురైన వారిలో వైద్యులు, ఉపాధ్యాయులు, న్యాయమూర్తులు, రచయితలు, కళాకారులు వున్నారు. పద్మాక్షమ్మ ఎన్‌కౌంటర్ పేరిట బూటకంగా ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రభుత్వ వుద్యోగి, ఒక ఆటోడ్రైవరు, ఒక కళాకారుడిని పొట్టన పెట్టుకున్నారు.

ఇలా హత్యలు చేయడంలో, ఫాసిజం అమలు చేయడంలో ముందు వరుసలో వుండే సిఐ గులాం సంధానీ, సిఐ తిరుపతి, ఎస్‌పి నళినీ ప్రభాత్, ఎస్‌పి ప్రవీణ్ కుమార్‌ల వంటి హంతకులను రివార్డులు, అవార్డులతో చంద్రబాబు ప్రభుత్వం సత్కరించింది. దాంతో వారు 'పద్మాక్షమ్మ గుట్టలు పునరావృతం అవుతాయని' బాహాటంగానే ప్రజలను బెదిరించారు.

చంద్రబాబు ప్రభుత్వ ఫాసిజం ఎంతగా పెచ్చరిల్లిందంటే సాధారణ సమస్యలపై ప్రజలు శాంతియుత ప్రదర్శనలకు, ధర్నాలకు పూనుకున్నా, సహించలేక లాఠీలు, తూటాలతో సమాధానం చెప్పింది. అంగన్‌వాడీ టీచర్స్‌పై లాఠీఛార్జీ, బషీర్‌బాగ్ హత్యాకాండ, కాల్దారి రైతులపై కాల్పులు మచ్చుతునకలు మాత్రమే. లాకప్ హత్యలు సరేసరి.

౨౦౦౩ నాటికి ఉత్తర తెలంగాణాలో ఒక్కో జిల్లాలో నలుగురు లేదా అయిదుగురు ఐపిఎస్ అధికారులు కేంద్రీకరించి ఉద్యమ అణచివేతలో క్రియాశీలంగా పాల్గొంటుండినారు. వాళ్ల అణచివేత, సంస్కరణల కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనసాగారు. నిర్బంధకాండను పెంచడంలో భాగంగా మరో పోలీసు రేంజిని ఏర్పర్చి కొత్త డిఐజిని నియమించారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా ఎస్‌పిలు ప్రవీణ్‌కుమార్, భక్షి, ఎం.ఎం. భగవత్‌లతోపాటు మరికొంత మంది పోలీసు అధికారులు కొత్త డిఐజి నాయకత్వంలో సమన్వయ సమావేశం జరిపి వుద్యమ అణచివేతకు సంబంధించిన నిర్దిష్ట నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం పోలీసులు గ్రామాలపై వందలాది మందితో ఎన్‌సర్కిల్‌మెంట్ దాడులు ఏరియా కూంబింగ్‌లు పెట్రోలింగ్‌లు, ఏరియా ఆంబుష్‌లు తీవ్రతరం చేసారు.

పూర్తికాలం కార్యకర్తల కుటుంబ సభ్యులతో పోలీసులు కౌన్సిలింగ్‌లు నిర్వహించి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడించారు. కొద్దిమంది మాజీలతో, లంపెన్లతో, పెత్తందార్లతో పార్టీపై విషంగక్కించారు. ఆపరేషన్ సంజీవని పేరుతో పూర్తికాలం కార్యకర్తల కుటుంబ సభ్యులకు వైద్య చికిత్స, బియ్యం, బట్టలు తదితరాలు పంపిణీ చేసారు. ఒకవైపు వారి కొడుకులను, బిడ్డలను చంపుతూ మరోవైపు వారి యోగక్షేమాలు పట్టించుకునే వారిలాగా ఫోజులు కొట్టారు.

పార్టీపై దుర్మార్గమైన దుష్ప్రచారాన్ని పత్రికా ప్రకటనలు, వాయిస్‌లు కరపత్రాలు, గోడపోస్టర్లు, బ్యానర్ల ద్వారా చేశారు. పార్టీ శిక్షించిన ప్రజా వ్యతిరేకులతో పోలీసులు పార్టీ వ్యతిరేక ర్యాలీలు తీయించారు. ఈస్ట్‌లో సర్పంచుల ద్వారా నోటీసులు పంపి సరెండర్ల ప్రహసనాన్ని నడిపాడు.

మలయా కమ్యూనిస్టు పార్టీని దెబ్బతీయడానికి గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాల పేరిట కాన్‌సంట్రేషన్ క్యాంపులు నెలకొల్పినట్టుగానే ఆదిలాబాద్ జిల్లాలో చంద్రబాబు ప్రభుత్వం ఆదివాసీ గూడాలను ఖాళీ చేయించాలని కుట్రపన్ని ౨౦౦౩ జూలైలో ఉట్నూర్ మండలం ధర్మాజీపేట గ్రామాన్ని తగుల బెట్టించింది. వరంగల్ జిల్లా ఎస్పీ నళినీ ప్రభాత్, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మంత్రి కడియం శ్రీహరిలు జిల్లా ఉద్యమాన్ని దెబ్బతీయడానికి నీచమైన చర్యలకు పూనుకోవటమేగా ఎస్పీ అయితే ఏకంగా ౨౦౦మంది విప్లవకారులను చంపుతానని బహిరంగంగా ప్రకటించి పోలీసులను ఉసిగొల్పాడు. ఇన్ఫార్మర్ నెట్‌వర్క్ ద్వారా దళాల ఆనుపానులు తెల్సుకుని వందల, వేల సంఖ్యలో గ్రేహౌండ్స్ బలగాలను దింపేవారు. నిరంతరం వందలాది పోలీసులు కూంబింగ్‌లు సాగించారు. ఆ క్రమంలో అమాయక ఆదివాసీ ప్రజలపై కాల్పులు జరపడంతో సహా అనేక నిర్బంధ రూపాలను ప్రయోగించారు. చాలాచోట్ల ఆదివాసీ ప్రజలు తమ జీవనోపాధి అయిన అటవీ ఉత్పత్తుల సేకరణను బంద్ పెట్టుకోవల్సిన స్థితి ఏర్పడింది.

గ్రామాలలోని పెత్తందారులు, మాజీలు, లంపెన్ పురుషులనేకాక డ్వాక్రా గ్రూపుల్లోని కొంతమంది నాయకురాళ్లను, లంపెన్ మహిళలనుపోలీసులు డబ్బుల ఆశలు చూపి లొంగదీసుకుని ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకున్నారు. మరోవైపు సంఘాల్లో కోవర్టులను జొప్పించి దళాలను, నాయకత్వాన్ని హతమార్చే కుట్రలు పన్నారు.

తమ ప్రియతమ నాయకుల అంత్యక్రియలకు హాజరైన ప్రజలను తీవ్ర వేధింపులకు గురిచేసారు. కా.ఆర్‌కె అంతిమయాత్రకు జనం తరలి వచ్చినప్పుడు పోలీసులు తాము తీసిన వీడియో క్యాసెట్ల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఒకేరోజు రాత్రి వేలాది మంది ప్రజలను అరెస్టు చేసి క్రూరంగా హింసించారు.

విప్లవకారులపై మానసిక యుద్ధంలో భాగంగా ప్రజా వ్యతిరేకులతో పార్టీ ఏరియా, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకుల దిష్టి బొమ్మలను ఊరేగించి ఉరితీయించారు. నక్సలైట్లు మా గ్రామాలకు రావద్దు అని బలవంతంగా ర్యాలీలు తీయించారు. పార్టీ నాయకులను వ్యక్తిగతంగా దూషిస్తూ దుష్ప్రచారం చేసారు. గ్రామాల్లో బలవంతంగా ఫండ్స్ వసూలు చేసి ఫ్లడ్ లైట్లు పెట్టించారు.

నల్లదండు ముఠాలవారితో విప్లవకారుల కుటుంబ సభ్యులను బెదిరించారు. ఈ నల్లదండు ముఠాలను తెలుగుదేశం గూండాలుగా వుపయోగించుకున్నారు. అనేక రకాల సంస్థలను నిర్మించి వాటికి నక్సలైట్ల కార్యకలాపాలను అడ్డుకునే కార్యక్రమాన్ని ఇచ్చారు. ఉద్యమ ప్రాంతాలన్నిటిలో వేల సంఖ్యలో వాలంటరీ సంఘాలను పుట్టగొడుగుల్లా పెట్టించి ప్రోత్సహించారు. ఇవి ప్రజలను విప్లవం నుండి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించడం నుండి కొన్ని చోట్ల నేరుగా ఇన్ఫార్మర్‌గిరీ చేసే వరకు ప్రజా వ్యతిరేక స్వభావంతోనే కొనసాగాయి. ఒక్క శ్రీకాళంలోనే మొత్తం ౪,౨౦౦ మైత్రి సంఘాలున్నాయి.

సింగరేణి సంఘటిత కార్మికోద్యమాన్ని దెబ్బతీయడానికి కూడా చంద్రబాబు ఫాసిస్టు ప్రభుత్వం ఎన్నో కుట్రలు పన్నింది. సమ్మె నిషేధపు చట్టం, లాకౌట్లు, మస్టర్ల కోత చట్టం, డిస్మిస్‌లు, సస్పెన్షన్‌లు, ట్రాన్స్‌ఫర్‌లు, అరెస్టులు, కుట్రకేసులు, ఎస్మా, టాడా వంటి చట్టాలెన్నింటినో అమలు చేసాయి. లాఠీఛార్జీలు, చిత్రహింసలు, కార్మికులపై

కాల్పులు, ఎన్‌కౌంటర్ పేర హత్యలు పెచ్చరిల్లిపోయాయి. మరోవైపు కార్మికులను సమ్మె నుండి దూరం చేయడానికి రొట్టె ముక్కలను విసిరినట్టుగా సంస్కరణల వలను విసిరారు.

నవంబరు 26లో ఆపరేషన్ జన్మభూమిని చేపట్టాక, 27, 28, 29 వరకు యువకులను గ్రామాల నుండి తీసుకువెళ్లి కాల్చి చంపడం పెద్ద యెత్తున కొనసాగింది. అనేకమంది సంఘ నాయకులు అమరులు అయ్యారు. కొన్నిచోట్ల ప్రజలు ప్రతిఘటిస్తున్నా వినకుండా కాల్చి చంపిన సంఘటనలు వున్నాయి.

సంఘ నాయకులుగానీ, మిలిటెంట్లుగానీ గ్రామాల్లో తమ ఇండ్లల్లో వుండే పరిస్థితి లేకుండా చేసారు. ఎంతో మందిని కొట్టి చిత్రహింసలు పెట్టి పనులు చేసుకోలేకుండా చేసారు. ఆస్తులు ధ్వంసమయ్యాయి. పంట నాశనం చేసారు. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణా మైదాన ప్రాంత రైతాంగం ఈ నిర్బంధ కాలంలో అనుభవించిన వెతలు ఎంత చెప్పినా తీరనివే.

ఆనాడు శ్రీకాకుళ ఉద్యమ కాలంలో చినబాబును 14 యేళ్ల వయసులో ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపారు. ఈ 12 యేళ్లలో అనేక మంది ముక్కుపచ్చలారని పిల్లలు సైతం పోలీసు ముష్కరుల అమానుషత్వానికి బలైయ్యారు. మెదక్ జిల్లా యాదగిరి, ఈస్ట్‌లో సన్యాసిరావు, గుంటూరులో 13 యేళ్ల అమ్మాయి, నల్గొండలో మౌనిక వంటి ఎందరో బాలబాలికలు ఈ నిర్బంధకాండకు బలయ్యారు. అనేక ఎన్‌కౌంటర్‌లలో చంటిపాపలు సైతం గాయపడి ప్రమాద స్థితిలో పడ్డారు. ప్రజల ప్రాణాలపట్ల ఏమాత్రం అక్కరలేని పోలీసులు ప్రజలకు గాయాలవుతాయనీ, చనిపోతారనీ తెలిసినా చిన్న పిల్లలున్నారని తెలిసినా నేరుగా కాల్పులు జరిపారు. తమ మీదకు నక్సలైట్లు కాల్పులు జరుపుతారనుకున్నప్పుడు చిన్నపిల్లలను అడ్డుపెట్టుకోవడానికి కూడా వాళ్లు వెనుకాడలేదు. మెదక్ జిల్లాలో ఇంటిని చుట్టుముట్టి ఎన్‌కౌంటర్ జరిపాక ఒక మైనర్ బాలిక సరెండర్ అవుతానని బయటకు వస్తే ఆమెకు దాహం తీర్చనీకి నీళ్లిచ్చి వెంటనే అక్కడే కాల్చి పడేసిన పోలీసుల్లో మానవత్వాన్ని ఆశించడం పిచ్చితనమే. విప్లవకారులు, జాతుల పోరాటకారులు పిల్లలను రిక్రూట్ చేసుకుంటారని గగ్గోలు పెట్టే ప్రభుత్వం వారిని చంపే విషయంలో మాత్రం ఎటువంటి తేడాలు చూడడం లేదు.

ఈ పన్నెండేళ్లలో దాదాపు 300మంది దాకా మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు. వారిలో అత్యధిక మెజారిటీ పోలీసుల చేతుల్లో మరణించినవారే. ఏ ప్రభుత్వమూ చంపనంత మంది మహిళలను చంపి చంద్రబాబు చరిత్రలో క్రూరమైన నియంతగా నిలిచిపోయాడు. సంఖ్యలోనేకాక వాసిలో కూడా ఎందరో ముఖ్యులైన మహిళా నాయకులు అమరులయ్యారు. తిరుపతి ఆర్గనైజర్ కా.పద్మ (1994), నిజామాబాద్ కమాండర్ స్వరూప (1992), విశాఖ ఆర్గనైజర్ (1999), కా.పద్మ (ఎన్‌టి ఎస్‌జడ్‌సిఎం, 2002), కా.లలిత (ఆదిలాబాద్ డిసిఎస్, 2003), కా.బెల్లిలలిత (1999), కా.సుగుణ (గుంటూరు డిసిఎం, 2003), కా.మాధవి (2004) చిట్టెక్క (1998), కా.పద్మ (ఝంఝావతి కమాండర్ 1998), ఆదివాసీ కామ్రేడ్ చెంచులక్ష్మి (1999), జెఎన్‌ఎం పద్మ, (2002) వంటి విలువైన నేతలెందరో అమరులయ్యారు. ఇంకా నాయకులుగా ఎదిగే అవకాశమున్న అటువంటి టాలెంట్స్ వున్న మహిళలెందరో ఆరంభంలోనే చిదిమి వేయబడ్డారు. ఇంకొక దారుణమైన విషయమేమింటే ఎన్‌కౌంటర్‌లలో గాయపడిన మహిళా కామ్రేడ్స్‌ను దాదాపుగా చాలామందిపై లైంగిక అత్యాచారం జరిపి మరీ చంపేయడం. చనిపోయే ముందు కూడా వారిని తీవ్రంగా అవమానపరిచి మరీ చంపడం పోలీసుల్లోని అమానుషత్వానికి పరాకాష్ట. మరోవైపు పార్టీలోని మహిళా కామ్రేడ్స్‌పై ఇంతటి నీచస్థితికి దిగజారిన పోలీసులు నైతికపరమైన ఆరోపణలతో దుష్ప్రచారం చేయడం సూర్యునిపై వుమ్మివేయడం లాంటిదే.

విప్లవోద్యమంలో శత్రువుతో యుద్ధంలో భాగంగా అమరులయ్యేవారే ప్రధానంగా వుంటారు. అయితే విప్లవాన్నే జీవితంగా స్వీకరించి పని చేస్తున్న క్రమంలో కొన్ని ఇతర కారణాలతో కూడా కామ్రేడ్స్ చనిపోతూ వుంటారు. వారు తమ జీవితాన్ని పూర్తిగా ప్రజల కోసమే అంకితం చేసారు కనుక వారి మరణం కూడా చిరస్మరణీయమైనదే.

కా.ఐ.వి (ప్రకాష్ మాస్టారు), కా.కుమారి (జెఎన్‌ఎం), కా.శ్రీనివాసులు (ఆజాద్) వంటి కొందరు కామ్రేడ్స్ తీవ్ర అనారోగ్యంపాలై అమరులయ్యారు.

మరికొందరు కామ్రేడ్స్ వివిధ రకాల ప్రమాదాల్లో అమరులయ్యారు. కొందరు రాత్రిపూట పొలాల వద్ద కరెంటు షాకులో చనిపోయారు. నల్లమల, శ్రీకాకుళం, ఈస్ట్‌లో పిడుగుపాటుకు గురై చనిపోయారు. కొందరు పాము కరిచి వైద్యం అందక చనిపోయారు. కొందరు తమ వద్దనో, పక్క కామ్రేడ్స్ వద్దనో వున్న తుపాకీ యాక్సిడెంటల్ ఫైర్ అయ్యి చనిపోయారు. మరికొందరు పేలుడు పదార్థంతో ప్రయోగాలు చేస్తూ మరణించారు.

అనారోగ్యాలుగానీ, ప్రమాదాలుగానీ విప్లవాచరణ క్రమంలో విప్లవ కర్తవ్య నిర్వహణలో భాగంగా ప్రధానంగా

ఎదుర్కున్నదే. విప్లవకారులు నిరంతరం ఎటువంటి త్యాగానికైనా సిద్ధంగా వుండడం అంటే ఇలాంటివి కూడా అనే అర్థం. అందుకనే శుష్క పండితులు వారిస్తున్నట్టుగా శత్రువు చేతిలో చనిపోకున్నా వారు అమరులు కాకుండాపోరు. వీరు తమ విప్లవ కృషి వల్ల ప్రజల గుండెల్లో నిరంతరం గూడు కట్టుకునే వున్నారు. అమరత్వానికి అదేకదా గీటురాయి.

రోజురోజుకూ తీవ్రతరమవుతున్న యుద్ధంలో అమరత్వాల సంఖ్య పెరుగుతూ వుంటుంది. అందరి అమరత్వాల గురించి ఒకేచోట చెప్పకోవడం సాధ్యం కాకపోవచ్చు. పైన మన కామ్రేడ్స్ అమరత్వం పొందిన కొన్ని ముఖ్యమైన సంఘటనలనే పేర్కొన్నాం. ఇంకా ఎందరి గురించో ఇక్కడ పేర్కొనలేకపోవచ్చు. ఇక్కడ లేకపోయినా ఆ కామ్రేడ్స్ జ్ఞాపకాలు, స్మృతులు ప్రజల, తోటి కామ్రేడ్స్ హృదయాల్లో ముఖ్యంగా ఆ కామ్రేడ్స్ అమరులైన ప్రాంత ప్రజల హృదయాల్లో ఎప్పటికీ సజీవంగా వుంటాయి. ముందుకు నడిపిస్తూనే వుంటాయి.

వర్గ పోరాటంలో అమరత్వం ఎంత సహజమో ఆ అమరుల కృషిని ప్రజలు, పార్టీ సంస్మరించుకోవడం అంతే సహజం, అనివార్యం. నిర్బంధం వుండడం, వుండకపోవడం పోరాట స్థితిపై ఎత్తుగడలపై ఆధారపడి వుండే విషయమేతప్ప సంస్మరణల్ని అడ్డుకోగలిగేదికాదు. నిర్బంధం సడలినప్పడు బహిరంగంగా జరుపుకోవచ్చు. నిర్బంధం వుంటే దాన్ని ఎదిరిస్తూ జరుపుకోవచ్చు. ఊపిరి సలపని అణచివేత వుంటే రహస్యంగా జరుపుకోవచ్చు. జైలు గోడల మధ్య ఒంటరి ఖైదీ తనతోనే తనలోనే సంభాషించుకుంటూ మౌనంగా నివాళి అర్పించవచ్చు. పోలీసు ప్రహారాల మధ్య వంట ఇంటిలో నలుగురు గృహిణులు దుఃఖాన్ని అదిమి పెట్టుకుంటూ అమరులకు జోహార్లు అర్పిస్తూ పిడికెళ్లెత్తవచ్చు.

ఎలా జరుపుకుంటున్నామనేది ఒక అంశమే. ఎందుకు జరుపుకుంటున్నామనేది ప్రధానం. భారత దేశంలో ఏ నూతన ప్రజాస్వామిక విప్లవాన్నైతే వాళ్లు కలలు కన్నారో అంతిమంగా ఏ కమ్యూనిస్టు సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలు అర్పించారో ఆ ఆశయాన్ని కొనసాగించాలనేదే ప్రధానాంశం.

ఆశయాన్ని కొనసాగించడమంటే నేటి సందర్భంలో యుద్ధాన్ని తీవ్రతరం చేయడమే. గత జూలై 28 నుండి ఈ జూలై 28 వరకు అమరులైన కామ్రేడ్సందరినీ సంస్మరించుకుంటున్న సందర్భంలోనే గత 2003 నుండి ఇప్పటి వరకు మనమే శత్రువుపై చేసిన ప్రతిదాడులను కూడా గుర్తు చేసుకోవడం సముచితంగా వుంటుంది. ఆ విజయాల వెనుక యుద్ధంలో భాగంగా అమరులైనవారి కృషి వుండడం వల్లేకాక జరిగిన నష్టాలను విస్తృతమైన యుద్ధ నేపథ్యంలో సరైన దృక్పథంతో అర్థం చేసుకోవడానికి కూడా అది వుపయోగ పడుతుంది.

శ్రీకాకుళం డివిజన్ ఆవిరిలో 2003 మే 30న కూంబింగ్‌కు వచ్చిన స్పెషల్ పోలీసులపై చేసిన ఆంబుష్‌లో ఒకడు చనిపోగా, మరొకడికి రెండు కాళ్లూపోయి తీవ్ర గాయాలయ్యాయి. 2003 మే 4న మల్కన్‌గిరి డివిజన్‌లో జరుగుతున్న ప్రొడక్షన్ క్యాంపుపై గ్రేహౌండ్స్ బలగాలు దాడి చేసినప్పడు జరిగిన ప్రతిఘటనలో ఒక గ్రేహౌండ్స్ ఎస్ఐ మట్టికరిచాడు. ఈస్ట్ డివిజన్ ఎల్లవరం ఏరియాలో జూన్ 14న జరిగిన పోలవరం ఆంబుష్‌లో ముగ్గురు సిఆర్‌పిఎఫ్ పోలీసులు చనిపోగా కొంతమందికి గాయాలయ్యాయి. ఆగస్టు 3వ తేదీన మల్కన్‌గిరి డివిజన్ బెజ్జంగివాడ ఆంబుష్‌లో మొత్తం 10మంది పోలీసులు చనిపోయారు. మరో 7గురికి గాయాలయ్యాయి.

అక్టోబరు 1న అలిపిరి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వున్న కారుపై వీర గెరిల్లాలు పకడ్బంధీ వ్యూహంతో మందుపాతరలు పేల్చారు. ఈ దాడిలో చంద్రబాబు చావకపోయినప్పటికీ ఎంతో సాహసోపేతమైన ఈ దాడి రాష్ట్ర పీడిత ప్రజానీకాన్ని పెద్దయెత్తున వుత్సాహపరిచింది. ఎనిమిది ఏళ్లుగా తీవ్ర నిర్బంధంలో మగ్గిపోతూ చంద్రబాబు వరల్డ్‌బ్యాంకు విధానాలతో కొనవూపిరిగా బతుకున్న ప్రజల కసికి ఈ దాడి ప్రతిరూపంగా నిలిచింది.

2003లో నల్లమల ఫారెస్టు డివిజన్‌లోని ఎర్రగొండపాలెం ఏరియాలోని అల్లిపాలెంలో శత్రువు సాయుధ బలగాలపై చేసిన ఆంబుష్‌లో ఒక ఎస్ఐ, ఒక డ్రైవర్ గాయపడ్డారు. నల్లగొండ జిల్లా నెమలిపురి వద్ద చేసిన ఆంబుష్‌లో ఒక ఆర్ఎస్ఐ, ఇద్దరు పోలీసులు చచ్చారు. ఒకడు గాయపడ్డాడు. 2003 మే లో నల్లగొండ జిల్లా కొండెంగల గుట్ట ఆంబుష్‌లో ఒక ఎస్ఐ, ఒక పోలీసు గాయపడ్డారు. 2003 ఫిబ్రవరిలో భూదేవిపాయ ఆంబుష్‌లో ఆరుగురు పోలీసులు గాయపడ్డారు. కృష్ణానదిలో ప్రయాణిస్తున్న పోలీసులపై గెరిల్లాలు క్లేమోర్ మైన్ పేల్చి, కాల్పులు జరపడంతో తీవ్ర ఆందోళనకు గురై కొన్ని ఆయుధాలు కృష్ణానదిలో పోగొట్టుకున్నారు.

కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌పై 2003లో మైన్స్‌తో దాడి చేయగా కొద్దిమందికి గాయాలయినాయి.

2004 ఎన్నికల సమయంలో ఈస్ట్ డివిజన్‌లో పెద్రాళ్ల ఆంబుష్‌లో ముగ్గురు ఎస్ఎస్ఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. పిజిఎ బలగాలు ఇక్కడ శత్రువుపై 11చోట్ల దాడులు జరిపాయి. శ్రీకాకుళం డివిజన్‌లో ఏప్రిల్ 20

సాయంత్రం ఇరుకుట్టి ఆంబుష్‌లో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరు మామూలుగా గాయపడ్డారు. మార్చి 17న మంత్రి మణికుమారి భర్త టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి అయిన వెంకటరాజును గెరిల్లాలు ఖతం చేసారు. టిడిపి పార్లమెంటుపక్ష నాయకుడైన కింజవరపు ఎర్రం నాయుడిని టార్గెట్ చేస్తూ ఏప్రిల్ 18, 2004న మందుపాతర పేల్చగా అతడు గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు.

2004 జనవరి 4న గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ బిళం దగ్గర మైన్స్ పేల్చగా గ్రేహౌండ్స్ పోలీసులకు గాయాలయ్యాయి. ఫిబ్రవరి 2న ఇదే జిల్లా మన్నేసుల్తాన్ పాలెం బస్టాండులో వున్న పోలీసు బ్యాచీపై క్లైమోర్ మైన్ పేల్చగా వాళ్లు తృటిలో తప్పకున్నారు. వారి కిట్లు చెల్లాచెదురయ్యాయి. 2004 ఏప్రిల్ 10న రేమిడిచర్ల గ్రామంలో ఎర్రబస్సులో ప్రయాణించే పోలీసులను బెదిరించడంలో భాగంగా బస్సు ముందర మందుపాతర పేల్చి పోలీసులపై కాల్పులు జరిపారు. టార్గెట్‌గా వున్న పోలీసు మూడు యేళ్ల పసిపాపను అడ్డుపెట్టుకుని తప్పించుకున్నాడు. ఒక 410 మస్కట్ గెరిల్లాల స్వాధీనమైంది. అదే రోజు సాయంత్రం దానికి కేవలం పావుగంట దూరంలో కాలినడకన వస్తున్న పోలీసు బ్యాచీపై మందుపాతర పేల్చగా ఒక సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్, ఒక యాంటి నక్సల్ కానిస్టేబుల్ ఖతం అయ్యారు. అనేకచోట్ల పోలీసు స్టేషన్లపై చికాకుపరిచే చర్యల్లో భాగంగా కాల్పులు జరిపారు. బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌పై రాకెట్ లాంఛర్లతో దాడి చేసారు.

ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా కంభం ఏ.పి.ఎస్.పి క్యాంపుపై గ్రెనేడ్స్ వేసి, దోర్నాల మండల సి.ఆర్.పి.ఎఫ్ క్యాంపు రెండుసార్లు రాకెట్ లాంఛర్లతో దాడి చేసారు. రాకెట్ లాంఛర్లను చూసి శతృవు బెంబేలెత్తి క్యాంపును ఎత్తేసుకున్నాడు. చాలా మంది పోలీసులు సెలవు పెట్టేసుకున్నారు.

2004 జనవరిలో కామ్రేడ్స్ సత్యం (ఎస్‌సిఎం), గంగారాం, శంకర్‌లను చంపివేసిన తరువాత వెంటనే అనంతపూర్ చెన్నేకొత్తపల్లి మండలంలో ఎం.పి. కాల్వ శ్రీనివాసులు తెలుగుదేశం నాయకుడు సాలూరిబాష ప్రయాణిస్తున కారుపై కసితో వున్న గెరిల్లాలు మందుపాతర పేల్చారు.

2004 ఏప్రిల్ 20న కరీంనగర్ జిల్లా అన్నారం వద్ద అంబుష్ చేయగా ఛత్తీస్‌ఘడ్ పోలీసులిద్దరికి గాయాలయినాయి. ఆదిలాబాద్ జిల్లాలో 2004 మార్చిలో జరిగిన ఒక ఆంబుష్‌లో ఒకడికి గాయాలయినాయి.

భారతదేశ చరిత్రలోనే మొదటిసారిగా భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్న కోరాపుట్ మల్టీరెయిడ్ దేశవ్యాప్తంగా పీడిత విప్లవ ప్రజానీకాన్ని ఉత్సాహపరిచి ఉర్రూతలూగించింది. అద్భుతమైన సమన్వయంతో, క్రమశిక్షణతో, నైపుణ్యంతో నిర్వహించిన ఈ రెయిడ్‌లో వందకు పైగా గెరిల్లాలు పాల్గొన్ని వివిధ రకాల 536 ఆయుధాలనూ పెద్దయెత్తున మందుగుండును స్వాధీనం చేసుకున్నారు. ఈ సాహసోపేతమైన రెయిడ్ శతృవు గుండెల్లో భయోత్పాతాన్ని సృష్టించింది. రెయిడ్ తరువాత వారం రోజులకు రోడ్డు క్లియర్ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ జవాన్లు 14మంది బూబీట్రాప్ పేలి తీవ్రంగా గాయాలపాలై ఆసుపత్రి పాలయ్యారు.

ఇదేకాక మరికొన్ని ప్రతిఘటనా చర్యలు, ప్రతిదాడులు ఇతర రాష్ట్రాల్లో కూడా జరిగాయి.

ఇవి ఆంధ్ర, ఏఓబి, ఉత్తరతెలంగాణా పరిధిల్లో రాజకీయ, మిలిటరీ టార్గెట్‌లపై జరిగిన కొన్ని దాడులు. ఇవికాక ఇన్ఫార్మర్ వ్యవస్థను దెబ్బతీస్తూ అనేక చర్యలు ఆంధ్ర రాష్ట్రమంతటా కొనసాగాయి. ఈ దాడుల్లో పాల్గొనడమేకాక అనేకచోట్ల చికాకు పరిచే చర్యలో మిలీషియా పెద్దయెత్తున చురుగ్గా పాల్గోవడం ప్రజాయుద్ధ స్వభానికి అద్దం పడుతుంది.

యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేయడం ద్వారానే మనం స్థావర ప్రాంతాలను ఏర్పర్చుకునే స్థాయికి పురోగమించగలుగుతాం. యుద్ధంలో త్యాగాలకు వెరువకుండా ముందుకు పోవడం ద్వారానే మన ప్రియతమ అమరులు కన్న కలలను సాకారం చేయగలుగుతాం. వారి ఆశయాలను కొనసాగించడానికి పునరంకితమయ్యే సందర్భమే జూలై 28.

అందుకే 2004 జూలై 28 – ఆగస్టు 3 అమరుల సంస్మరణ వారం సందర్భంగా అమరులకు తలవంచి జోహార్లర్పిస్తూ ఎత్తిన పిడికిళ్లతో మరోసారి ప్రతినబూనుదాం, నినదిద్దాం.

**అమరుల ఆశయాలను కొనసాగిద్దాం !**

**భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి !!**



కా  చారుమజుందార్



కా  ఆదిభట్లకైలాసం



కా  వెంకటాపు సత్యం



కా  సుబ్బారావు పాణి గ్రాహి



కా  సరోజ్ దత్తా



కా చాగంటి భాస్కర్












పంచాది కృష్ణమూర్తి



కా.పంచాది నిర్మల



కా స్నేహలత



కా పెద్ది శంకర్